సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 30 । జూలై । 2024



కోనోకార్పస్

విషపూరితంగా మారిన కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించగా అధికారులు చర్యలు చేపట్టారు. 10లో



కనుమరుగైన జ్ఞాపకం !

ఖమ్మం హెడ్‌పోస్టాఫీస్ పాత భవనాన్ని ఇటీవల నేలమట్టం చేయడంతో ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన జ్ఞాపకం కనుమరుగైపోయింది. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం కొంత మేర చల్లగానే ఉంటుంది. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెదవాగు రింగ్‌బండ్ పనులు ప్రారంభం



యంత్రాలతో పనులు చేస్తున్న దృశ్యం

అశ్వారావుపేట: మండలంలోని గుమ్మడవల్లి గ్రామ సమీపాన గల పెదవాగు ప్రాజెక్టు రింగ్ బండ్ పనులు సోమవారం ప్రారంభించారు. పెదవాగు ప్రాజెక్ట్ ఈనెల 18న వరద తాకిడితో కట్ట కోతకు గురైన విషయం తెలిసిందే. కాగా, రింగ్ బండ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేయడంతో పనులు మొదలయ్యాయి.

విజయ డెయిరీ డీడీగా మోహనమురళి



బాధ్యతలు స్వీకరిస్తున్న మోహనమురళి

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి ఖమ్మం జిల్లా పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (విజయ) ఉప సంచాలకులుగా నియమితులైన పి.మోహనమురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కామారెడ్డి జిల్లా నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. అలాగే, ఖమ్మం ఇన్‌చార్జిగా డీడీ ఉన్న ధన్‌రాజ్ నిజామాబాద్ బదిలీ చేశారు. ఈనేపథ్యాన బాధ్యతలు చేపట్టిన మోహనమురళి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పాల సేకరణ లక్ష్యాన్ని పెంచేలా ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం 10వేల లీటర్ల పాల సేకరణను లక్ష్యంగా ఎంచుకున్నామని చెప్పారు. అలాగే, ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ హాస్టళ్లకు విజయ పాల సరఫరా జరుగుతుండగా, భద్రాద్రి జిల్లాలోనూ రెండు, మూడు రోజుల్లో సరఫరా మొదలవుతుందని తెలిపారు. ఈమేరకు మోహనమురళికి డెయిరీ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రస్ట్‌బోర్డుపై గురి!

భద్రాద్రి రామాలయ పాలకమండలి కీలకం

- పెద్దమ్మతల్లి, అన్నపురెడ్డిపల్లి ఆలయాలపైనా నజర్
- భర్తీ ఎప్పుడోనని పలువురి ఎదురుచూపులు
- కార్పొరేషన్ నామినేటెడ్ పోస్టుల భర్తీతో ఆశావహుల్లో చలనం



భద్రాచలం రామాలయం వ్యూ

భద్రాచలం : రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లకు నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తయింది. ఇక జిల్లా స్థాయిలో పలు పోస్టుల భర్తీ కానున్న నేపథ్యంలో ఇప్పుడు ఆశావహుల దృష్టి ఆలయాల వైపు మళ్లింది. ఎన్నో ఏళ్లుగా భర్తీకి నోచుకోని ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్, ఇతర సభ్యుల పోస్టులకు జిల్లాలోని పలువురు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం, పాల్వంచలోని పెద్దమ్మతల్లి గుడి, అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాల పాలకమండళ్లకు తీవ్ర పోటీ నెలకొని ఉంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఈ బోర్డుల నియామకం ఆసక్తిగా మారింది.

కీలకమైన రామాలయ కమిటీ..

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం రాష్ట్రంలోని పెద్ద పుణ్యక్షేత్రాల్లో ఒకటి కాగా జిల్లాలో కీలకమైనది. దేవస్థానం అభివృద్ధితో పాటు, భక్తులకు కల్పించాల్సిన వసతులను పెంచడంలో ట్రస్ట్ బోర్డు ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అయితే ఇంతటి కీలకమైన ఈ ట్రస్ట్‌బోర్ట్ నియామకాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో పాలకమండలి కమిటీని నియమించనే లేదు. రామాలయంలో 13వ ట్రస్ట్ బోర్డు 2010 నవంబర్ 26 నుంచి 2012 నవంబర్ 25 వరకు పనిచేసింది. ఈ బోర్డు పదవీ కాలం ముగిసి పుష్కర కాలం కావస్తున్నా కొత్త బోర్డు కొలువుదీరలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి సారించడంతో ఆశావహుల్లో కదలిక వచ్చింది. జిల్లాలోని ముగ్గురు మంత్రులకు చెందిన ప్రధాన అనచురులతో పాటుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని ఉన్న పలువురు నాయకులు ఛైర్మన్, సభ్యుల పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే కొంతమంది సీఎంతో పాటు ఇతర మంత్రులకు దరఖాస్తులు, వినతిపత్రాలు అందజేయగా, మరికొందరు బయోడేటాలతో సిద్ధమవుతున్నారు.

'పెద్దమ్మతల్లి'కి పోటీ ఎక్కువే..

పాల్వంచ మండలంలోని జగన్నాథపురం – కేశవాపురం గ్రామాల మధ్య కొలువుదీరి భక్తుల కొంగుబంగారంగా పిలిచే పెద్దమ్మతల్లి ఆలయం జిల్లాలో రెండో స్థానంలో ఉంది. నిత్యం భక్తుల రాకతో రద్దీగా ఉండే ఈ ఆలయ వార్షికాదాయం రూ. రెండు కోట్లకు పైమాటే. ఈ ఆలయం ట్రస్ట్ బోర్డుకు సైతం పెద్ద ఎత్తున పోటీ నెలకొని ఉంది. ఈ ఆలయ ఏడో ట్రస్ట్ బోర్డు గడువు ఈ ఏడాది మార్చిలో ముగిసింది. ఛైర్మన్‌గా మహిపతి రామలింగంతో పాటు 12 మంది సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఒక అర్చకుడు పనిచేశారు. ఈ ట్రస్ట్ బోర్డు నియామకానికి నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో నిలిపివేశారు. ప్రస్తుతం కోడ్ ముగియడంతో పాటు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో పలువురు ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు ఛైర్మన్ పదవి రేసులో ఉన్నారని తెలుస్తుండగా, మరోవైపు మంత్రులు పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ రేణుకాచౌదరి అనుచరులు సైతం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

బాలాజీ వేంకటేశ్వరుడిపై కోటి ఆశలు..




అన్నపురెడ్డిపల్లి బాలాజీ వేంకటేశ్వర ఆలయం

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంపై కూడా పలువురు కోటి ఆశలు పెట్టుకున్నారు. 2,315 ఎకరాల భూములు, రూ.50 లక్షల వార్షికాదాయం, సుమారు రూ.6 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు కలిగిన ఈ దేవస్థానానికి చివరి ట్రస్ట్ బోర్డు గడువు 2012లో ముగిసింది. దేవాదాయ శాఖ పరిధిలో 6ఏ రెండో కేటగిరీలో ఉన్న ఈ దేవస్థానానికి తొలి ట్రస్ట్ బోర్డులో ఛైర్మన్‌తో సహా 12 మంది ఉండగా, చివరి ట్రస్టు బోర్డులో ఛైర్మన్, ఆరుగురు సభ్యులు, ఒక అర్చకుడు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఉన్నారు. ఎంతో చారిత్రాత్మక ప్రాధాన్యం గల ఈ ఆలయ ట్రస్ట్ బోర్డుపై సైతం పలువురు కోటి ఆశలు పెట్టుకున్నారు. ఛైర్మన్ రేసులో అశ్వారావుపేట ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడి పేరు వినిపిస్తుండగా, ఇతర నాయకులు సైతం తమ లాబీయింగ్‌ను ముమ్మరం చేశారు.

కూల్చివేతకు రంగం సిద్ధం

- రేపు ఉదయం కూలింగ్ టవర్ల తొలగింపు
- ఇంక్లోజన్ పద్ధతిలో నేలమట్టం
- కనుమరుగు కానున్న ఎత్తయిన టవర్లు



కూల్చివేయనున్న కేటీపీఎస్ పాత ప్లాంట్ కూలింగ్ టవర్లు

పాల్వంచ : పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ పాత ప్లాంట్(ఓఅండ్‌ఎం)లో కూలింగ్ టవర్ల కూల్చివేతకు రంగం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం ఇంక్లోజన్ పద్ధతి(ఒకేచోట కుప్పకూలేలా)లో తొలగింపునకు చర్యలు చేపట్టారు. కర్మాగారంలో మూడు స్టేషన్లలోని ఎనిమిది టవర్లను తీసేయనున్నారు. దీంతో పాల్వంచకే తలమానికంగా కనిపించే టవర్లు ఇక కనుమరుగు కానున్నాయి. కర్మాగారంలోని అత్యంత ఎత్తయిన ఈ టవర్ల కూల్చివేత మినహా మిగిలిన విభాగాలను ఇప్పటికే నేలమట్టం చేసి, వాటి తుక్కును తరలించేశారు. కూలింగ్ టవర్ల కూల్చివేతకు ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో అనుమతులు పెండింగ్‌లో పడ్డాయి. టవర్లతో పాటు గతంలో నేలమట్టం చేసిన పనులకు సంబంధించి జెన్‌కో సంస్థ టెండర్లు ఆహ్వానించగా రూ.485 కోట్లకు హెచ్‌ఆర్ కమర్షియల్ సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకుంది.

ఐదు నెలల క్రితమే చిమ్నీలు..

కేటీపీఎస్ పాత ప్లాంట్‌లో 100, 120 మీటర్ల ఎత్తులో ఉండే చిమ్నీలను గత ఫిబ్రవరిలోనే నేలమట్టం చేశారు. ఈ నిర్మాణాల కూల్చివేత పనుల దృశ్యాలు మరువని జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. ఇక టవర్ల కూల్చివేత పనులు పూర్తి చేయాలంటే చుట్టూ ఎక్స్‌ప్లోజర్లను పెట్టి పక్కకు పడకుండా ఇంక్లోజన్ పద్ధతిలో కుప్పకూలేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల ఢిల్లీలోని నోయిడా టవర్లను కూల్చిన టెక్నీషియన్లతోనే హెచ్‌ఆర్ కమర్షియల్ సంస్థ ఇక్కడ కూడా పనులు చేయించనున్నట్లు తెలిసింది.

పట్టణానికే ప్రత్యేక గుర్తుగా..

కూలింగ్ టవర్లు అత్యంత ఎత్తయినవిగా కనిపిస్తూ కనువిందు చేస్తుంటాయి. ఈ ప్రాంతానికి వచ్చే ప్రజలు, కిన్నెరసానికి వెళ్లే పర్యాటకులు ఈ టవర్లను ఫొటోలు తీసుకుంటూ మురిసిపోతుంటారు. 1965 – 67 సంవత్సరాల మధ్య నిర్మించిన కేటీపీఎస్ ఏ, బీ, సీ స్టేషన్లలో 60 మెగావాట్ల సామర్థ్యం గల 1, 2, 3, 4 యూనిట్లు, 120 మెగావాట్ల సామర్థ్యం గల 5, 6, 7, 8 యూనిట్లు ఉన్నాయి. ఒక్కో స్టేషన్‌కు ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఎనిమిది కూలింగ్ టవర్లు నిర్మించారు. విద్యుత్ ఉత్పత్తి చేసే క్రమంలో నీరు, బొగ్గు మండించినప్పుడు వచ్చే వేడిని తగ్గించేందుకు కూలింగ్ టవర్లు ఉపకరిస్తాయి. ఈ టవర్లను చూసేందుకు సైతం అనేక మంది టూరిస్ట్‌లు ఆసక్తి కనబరుస్తుంటారు.

గ్రామీణ ఉత్తమ డాక్ సేవక్‌గా సుభాష్

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న కొమరారం పోస్టుమాస్టర్



సీఎంజీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సుభాష్

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం పోస్టు మాస్టర్ అనుగోజు సుభాష్ రాష్ట్ర స్థాయిలో గ్రామీణ ఉత్తమ డాక్ సేవక్ అవార్డును హైదరాబాద్‌లో సోమవారం అందుకున్నారు. మారుమూల ప్రాంతంలో అత్యధిక పోస్టల్ అకౌంట్లు ప్రారంభించడం, మెరుగ్గా ప్రజలకు పోస్టల్ సేవలు అందించడంతో ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది కూడా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ అవార్డు అందుకున్నానని, నాడు ఉన్నతాధికారులు అందించిన ప్రోత్సాహంతో మరింత మెరుగ్గా పనిచేయడం వల్లే ఈ ఏడాది ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యానని చెప్పారు. సుభాష్‌ను చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి తదితరులు అభినందించారు.

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎస్పీ రోహిత్‌రాజ్



ఎస్పీకి సమస్యలు వివరిస్తున్న బాధితులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. సోమవారం నాటి గ్రీవెన్స్‌కు వచ్చిన బాధితుల నుంచి వినతులు స్వీకరించిన ఆయన.. సమస్యల పరిష్కారానికి ఆయా స్టేషన్ల పరిధిలోని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రీవెన్స్‌కు ఎక్కువగా భూ సమస్యలు, ఆర్థిక పరమైనవి, మద్యం సేవించి బాధ పెడుతున్నారనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. సోమవారం నాటి గ్రీవెన్స్‌లో తమ భూమిని అక్రమించారని, న్యాయం చేయాలని ఓ బాధితుడు కోరగా, తన భర్త మద్యం సేవించి ఇంట్లో అందరిపై దాడి చేస్తున్నాడంటూ మరో మహిళ ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. తక్కువ రేటుకే బంగారం ఇస్తానని చెప్పి ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకుని చీటింగ్ చేశాడని మరో మహిళ తెలిపిందని వివరించారు.

రౌడీషీటర్లపై నిఘా పెట్టాలి

రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా పెట్టాలని, ప్రజా జీవితానికి విఘాతం కలిగించేలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. సోమవారం ఆయన కొత్తగూడెంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని పెండింగ్ కేసుల వివరాల గురించి సీఐ రమేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనాలను నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాలతో నిత్యం తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలఅన్నారు. స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఆయన వెంట కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఉన్నారు.

తొలగిన 'ప్రమాదం'

- భద్రాచలం వద్ద 42.80 అడుగులకు చేరిన గోదావరి ప్రవాహం
- మొదటి ప్రమాద హెచ్చరిక కూడా ఉపసంహరణ
- ఏజెన్సీలో రాకపోకలు పునఃప్రారంభం
- కాలనీ వాసులు ఇంకా పునరావాస శిబిరంలోనే..



భద్రాచలం వద్ద తగ్గిన గోదావరి ప్రవాహం

భద్రాచలం : భద్రాచలం వద్ద గోదావరి క్రమేపీ తగ్గుతోంది. సోమవారం రాత్రి 9 గంటలకు నీటి మట్టం 42.90 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను సైతం ఉపసంహరించారు. ఉదయం 7 గంటలకు 45.40 అడుగుల మేర ఉండగా, మధ్యాహ్నం ఒంటిగంటకు 44 అడుగులకు చేరింది. సాయంత్రం 6 గంటలకు 43.2 అడుగులతో 9,41,704 క్యూసెక్కుల నీటితో ప్రవహించింది. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు 43 అడుగుల వద్ద నిలకడగా ప్రవహించిన గోదావరి.. 9 గంటలకు మరికొంత తగ్గడంతో ఆర్డీఓ దామోదర్‌రావు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. 11 గంటలకు 42.80 అడుగలకు చేరింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడం, తాలిపేరు ఉధృతి సైతం తగ్గడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రాకపోకలు షురూ..

ఏజెన్సీలో పలు ప్రధాన రహదారులపైకి గోదావరి వరద నీరు చేరడంతో వారం రోజులుగా అన్నివైపులా రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి నీటి మట్టం తగ్గడంతో సోమవారం రవాణా ప్రారంభమైంది. భద్రాచలం నుంచి చర్ల, వెంకటాపురానికి, జాతీయ రహదారిపై తాత్కాలికంగా పోసిన కరకట్టను తొలగించటంతో కూనవరం, చింతూరు వైపు ఆటోలు, ఇతర వాహనాలు తిరిగాయి. ఇక భద్రాచలంలోని నన్నపనేని మోహన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి తరలించిన ఏఎంసీ, అశోక్‌నగర్ కొత్తకాలనీ వాసులను ప్రస్తుతం అక్కడే ఉంచారు. గోదావరి వరద పూర్తిగా తగ్గితే మంగళవారం వారిని ఇళ్లకు తరలించే అవకాశం ఉంది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కరకట్ట, ముంపు కాలనీ, ఇతర ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లారు.



తాత్కాలిక కరకట్ట తొలగింపుతో కూనవరం రోడ్డులో తిరుగుతున్న వాహనాలు

అభాగ్యులకు అండ.. మిషన్ వాత్సల్య

- 6 – 18 ఏళ్ల అనాథలకు నెలకు రూ.4వేలు
- నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ
- జిల్లాలో 713 మంది దరఖాస్తు
- ప్రస్తుతం 292 మందికి లబ్ధి



కొత్తగూడెంటౌన్: అనాథలు, అభాగ్యులు, పేదరికంలో ఉన్న వారికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఈ పథకానికి ఎంపికైన 6 నుంచి 18 ఏళ్ల లోపు వారికి నెలకు రూ.4 వేల చొప్పున రెండు సంవత్సరాల పాటు అందించనుంది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హత గల బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది. జిల్లాలో ఐసీడీఎస్ పరిధిలోని 2,060 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో దరఖాస్తులు అందజేయాలి. అంగన్‌వాడీ టీచర్లు వాటిని ఐసీడీఎస్ అధికారులకు పంపించాల్సి ఉంటుంది. జిల్లాలో ఇప్పటివరకు 713 దరఖాస్తులు అందగా, ప్రస్తుతం 292 మందికి వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అవుతోందని అధికారులు తెలిపారు.

పథకం అమలు తీరిలా..

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అనాథలు, అభాగ్యులైన వారికి ఆర్థిక సహాయం అందించేందుకు 2013 – 14 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం (రూ.2,400) రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం (రూ.1,600) కలిపి రూ.4 వేలు లబ్ధిదారులకు అందజేస్తారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 2013–14 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా భద్రాద్రి జిల్లాలో 2023 నుంచే అమలవుతోంది. ఎంపికైన లబ్ధిదారులకు రెండేళ్ల పాటు మాత్రమే నగదు చెల్లిస్తారు. అర్హుల ఎంపిక, కేటాయింపు నిరంతర ప్రక్రియగా సాగుతుందని అధికారులు వెల్లడించారు.

అభాగ్యులకు ఆర్థిక భరోసా



అనాథలు అభాగ్యులకు మిషన్ వాత్సల్య పథకం ఆర్థిక భరోసా కల్పిస్తుంది. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో ప్రస్తుతం 292 మందికి నెలకు రూ.4వేల చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నాం. ఈ పథకం నిరంతరం కొనసాగుతుంది. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో దరఖాస్తులు అందజేస్తే కలెక్టర్‌కు పంపించి అర్హులను ఎంపిక చేస్తాం.

– వేల్పుల విజేత, జిల్లా శిశు, సంక్షేమాధికారి

ఎవరు అర్హులంటే..

తల్లిదండ్రులను కోల్పోయిన వారు, దూరమైన వారు, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధుల బారిన పడినవారు, పేదరికంలో ఉంటూ ఇంటి పెద్దను కోల్పోయిన వారు, ఇళ్లు లేని చిన్నారులు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాల బాలికలు ఈ పథకానికి అర్హులని అధికారులు తెలిపారు. దరఖాస్తు చేసుకునే బాలుడు లేదా బాలిక తమ బర్త్ సర్టిఫికెట్‌తో పాలు తండ్రి మరణిస్తే సంబంధిత ధ్రువీకరణ పత్రం, ప్రస్తుతం ఎవరి సంరక్షణలో అయినా ఉంటే వారి రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ప్రస్తుత స్టడీ సర్టిఫికెట్, బ్యాంకు ఖాతా వివరాలు జత చేయాల్సి ఉంటుందని వివరించారు.

కరకట్ట నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వాలి

- లోక్‌సభలో ఎంపీ బలరాం నాయక్



మాట్లాడుతున్న ఎంపీ బలరాం నాయక్

భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీలో గోదావరి ముంపు నుంచి ప్రజలను కాపాడేందుకు 25 కి.మీ. మేర కరకట్ట నిర్మించేందుకు రూ.4వేల కోట్లను కేంద్రప్రభుత్వం మంజూరు చేయాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన రామాలయానికి దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని తెలిపారు. అయితే, ఏటా గోదావరి వరదతో ఆదివాసీలు, గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈనేపథ్యాన ముంపు నుంచి కాపాడేలా కరకట్ట నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అద్దెకు అందుబాటులో ఆర్టీసీ బస్సులు

చుంచుపల్లి: కొత్తగూడెం పరిసర ప్రాంత ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు అద్దె ప్రాతిపదికన అందుబాటులో ఉంచామని కొత్తగూడెం డిపో మేనేజర్ ఎం.దేవేందర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, విహారయాత్రలు, పిక్నిక్‌లకు బస్సులు అద్దెకు ఇస్తామని పేర్కొన్నారు. అవసరమైన వారు 99592 25959, 93467 28893, 90103 74644 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం


మాట్లాడుతున్న డీఈ నందయ్య

జూలూరుపాడు: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని టీజీఎస్‌పీడీసీఎల్ కొత్తగూడెం డివిజనల్ ఇంజనీర్ నందయ్య అన్నారు. సోమవారం వినోభానగర్ గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించగా డీఈ మాట్లాడారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలు, విరిగిన లేదా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చుతామని, వేలాడుతూ ప్రమాదకరంగా మారిన లూజ్ విద్యుత్ తీగలను సరి చేస్తామని చెప్పారు. రైతులు భద్రత సూత్రాలు, విద్యుత్ పొదుపు పాటించాలని సూచించారు. ప్రయోగత్మాకంగా విద్యుత్ మోటార్‌కు కెపాసిటర్‌ను అమర్చి చూపించారు. కార్యక్రమంలో ఏడీఈ యాసిన్, ఏఈ సతీశ్‌కుమార్, విద్యుత్‌శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

పినపాక: వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని జానంపేట గ్రామంలో సోమవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జానంపేట గ్రామంలో ప్రధాన రహదారిపై పడాల జయంత్ అనే బాలుడు నడుచుకుంటూ వెళ్తుండగా వీధి కుక్కలు దాడి వేశాయి. బాలుడిని జానంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు


దహన సంస్కారాలు నిర్వహిస్తున్న కుమార్తె

కరకగూడెం: అనారోగ్యంతో మృతి చెందిన తండ్రికి కూతురు తలకొరివి పెట్టింది. మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన కాంపాటి మల్లయ్య(70) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కాగా, కుమారుడు గతంలోనే మృతి చెందాడు. దీంతో చిన్న కుమార్తె శిరీష తండ్రికి తలకొరివి పెట్టి దహన సంస్కారాలు పూర్తి చేసింది.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు


లొంగిపోయిన మావోయిస్టులతో పోలీసు అధికారులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సోమవారం 14 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బీజాపూర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న 14 మంది మావోయిస్టులు బీజాపూర్ డీఎస్పీ సుధీర్ సర్కార్ ముందు లొంగిపోయారు. వీరందరికీ తక్షణ ఆర్థిక సాయం అందించారు. వీరంతా పలు ఇన్‌ఫార్మర్ల నెపంతో పలువురిని హతమార్చిన సంఘటనలలో పాల్గొన్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో లొంగుబాటుతో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

పాతకమలాపురంలో చోరీకి యత్నం

కారేపల్లి: తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులకొట్టి ఓ వ్యక్తి చోరీకి యత్నించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాతకమలాపురానికి చెందిన మల్లెల శ్రీనివాస్ కుటుంబంతో సహా రెండు నెలల క్రితం హైదరాబాద్ వెళ్లి అక్కడే జీవనం సాగిస్తున్నాడు. అప్పటి నుంచి ఇంటికి తాళం వేసి ఉండడంతో గుర్తించిన ఓ దుండగుడు తలుపులు పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. అయితే, బీరువాలో ఏమీ దొరకకపోవడంతో సామగ్రి చిందరవందర చేసి వెళ్లిపోయాడు. తాజాగా గ్రామానికి వచ్చిన శ్రీనివాస్ చోరీ యత్నాన్ని గమనించి ఫిర్యాదు చేయగా కారేపల్లి ఎస్‌ఐ ఎన్.రాజారాం క్లూస్ టీంతో కలిసి పరిశీలించారు.

గోదావరిలోకి దిగి వ్యక్తి మృతి


శోభన్‌బాబు (ఫైల్)

చర్ల: మండలంలోని లింగాపురం వద్ద వరదకు కొట్టుకొస్తున్న కలప కోసం సోమవారం గోదావరి నదిలో దిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. లింగాపురానికి చెందిన కొంగూరు శోభన్‌బాబు (49) గోదావరి పాయలో వరదకు కొట్టుకు వచ్చిన కట్టెలను తీసుకొచ్చేందుకు వెళ్లి నీటిలో గల్లంతయ్యాడు. స్థానికులు వెతకగా మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

కోనోకార్పస్..!


కొత్తగూడెం- పాల్వంచ రహదారిలో కోనోకార్పస్ చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

- పర్యావరణానికి చేటు కలిగిస్తున్న మొక్కలు
- జిల్లావ్యాప్తంగా చెట్ల తొలగింపుకు కలెక్టర్ ఆదేశాలు
- నాలుగు రోజులుగా నరికిస్తున్న అధికారులు

చుంచుపల్లి: జిల్లాలో విషపూరిత కోనోకార్పస్ మొక్కల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. అవగాహన కొరవడి పర్యావరణానికి హాని కలిగించే ఈ మొక్కలను నాలుగైదేళ్ల క్రితం హరితహారంలో భాగంగా నాటారు. రోడ్ల పక్కన, డివైడర్ల మధ్య, ఖాళీ స్థలాలు, ఆర్వోఎఫ్ఆర్ భూముల్లో విరివిగా నాటారు. పచ్చదనం, అందం కోసం పెంచే వీటివల్ల నష్టమే ఎక్కువని నిపుణులు చెబుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. కాగా ఈ మొక్కలను పూర్తిగా తొలగించాలని ఇటీవల కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. దీంతో అటవీశాఖ అనుమతి తీసుకుని ఇటీవల కోనోకార్పస్ చెట్లు పూర్తిగా తొలగించే ప్రక్రియ చేపట్టారు. జిల్లా అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకుని తొలగించిన చెట్ల స్థానంలో పర్యావరణానికి మేలు చేసే మొక్కలు నాటేలా డీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

మొక్కకు రూ. 50 వెచ్చించారు..

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ఈ మొక్కలు నాటారు. కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి చేటు కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నా పెడచెవిన పెట్టారు. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీల పరిధిలో సుమారు 3 లక్షల మొక్కలు నాటినట్లు అధికారులు చెబుతున్నారు. పంచాయతీల స్థాయిని బట్టి 250 నుంచి 500 వరకు, మున్సిపాలిటీల్లో వేల సంఖ్యలో, మిగతావి ఖాళీ స్థలాల్లో, ఫుట్‌పాత్‌ల పక్కన నాటారు. ఒక్కో మొక్కకు రూ.50 వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ చొప్పున సుమారు జిల్లాలో రూ. 1.50 కోట్లకుపైగా వెచ్చించినట్లు తెలుస్తుండగా, ఆ మేరకు ప్రజాధనం వృథాగా మారింది.

ప్రస్తుతం రాష్ట్రంలో నిషేధం

కోనోకార్పస్ మొక్కల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. అటవీ ప్రాంతాల్లో పెరిగితే గడ్డి జాతి, ఇతర కలుపు మొక్కలు పెరగడం కష్టమవుతుందని, తద్వారా వన్యప్రాణాలకు ఆహారం దొరకదని పేర్కొంటున్నారు. మొక్కలు సాధారణంగా కార్బన్‌డై ఆక్సైడ్ గ్రహించి, ఆక్సిజన్ విడుదల చేస్తాయి. కానీ ఈ మొక్కలు ఆక్సిజన్‌ను తీసుకుని కార్బన్‌డయాక్సైడ్‌ను విడుదల చేస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో ఇప్పటికే చాలాదేశాలతో పాటు తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ మొక్కలు నాటడాన్ని నిషేధించింది. కోనోకార్పస్ మొక్కలు మనుషుల చర్మం, శ్వాసకోశ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని పరిశోధనల్లో తేలింది. వీటి పుప్పొడి చాలా ప్రమాదకరమని, చర్మ, శ్వాసకోశ వ్యాధులు, రక్తపోటు, గుండెకు సంబంధించిన సమస్యలకు కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

మంచి నిర్ణయం..



అవగాహన రాహిత్యంతో జిల్లా వ్యాప్తంగా గతంలో కోనోకార్పస్ మొక్కలు నాటారు. వీటివల్ల మనుషులతో పాటు జీవకోటికి ప్రమాదం పొంచి ఉంది. ఈ మొక్కల తొలగింపు మంచి నిర్ణయం.
–మొక్కల రాజశేఖర్, పర్యావరణ ప్రేమికుడు

ఉధృతంగా గోదావరి..

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద పరవళ్లు


దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి ప్రవాహం

అశ్వాపురం: అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలోని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆనకట్ట వద్ద సోమవారం 52.2 మీటర్ల నీటిమట్టంతో.. 10 అడుగుల ఎత్తులో గోదావరి ప్రవాహం నమోదైంది. ఆనకట్ట సమీపాన అసంపూర్తిగా నిలిచిన సీతమ్మసాగర్ బ్యారేజీ సగానికి పైగా వరదలో మునిగింది. అలాగే, గోదావరి, సీతారామ ప్రధాన కాల్వకు అడ్డుగా ఉన్న మట్టికట్ట వరద ఉధృతికి తెగిపోగా.. సీతారామ కెనాల్‌లోకి నీరు ప్రవేశించి ఆమెర్దలో హెడ్ రెగ్యులేటర్ వరకు కెనాల్ గోదావరిని తలపిస్తోంది.

ఆర్థికసాయం అందించరూ..

- తొమ్మిదేళ్ల పాప సహన్య మెదడులో కణితి
- ఆపరేషన్ చేయాలంటే రూ.5లక్షల ఖర్చు
- దాతల కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు


దాతల సాయం కోసం వేడుకుంటున్న సహన్య కుటుంబ సభ్యులు

కరకగూడెం: అందరితో కలిసి ఆడుకోవాల్సిన చిన్నారి అనారోగ్యంతో బాధపడుతోంది. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ఈసం సురేందర్, యమున దంపతులకు తొమ్మిదేళ్ల కూతురు సహన్య ఉంది. సురేందర్ మణుగూరులో పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ, మణుగూరులోనే నివాసం ఉంటున్నాడు. ఇటీవల సహన్య మూర్ఛతో కింద పడుతుండగా తల్లిదండ్రులు మణుగూరు ఆస్పత్రిలో చికిత్స అందించారు. తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెదడులో కణితి ఏర్పడిందని, తక్షణమే ఆపరేషన్ చేయాలని, రూ.5 లక్షలు ఖర్చు అవుతుందన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆపరేషన్ చేసిన రెండేళ్ల వరకు బాలికకు మాటలు రావని వైద్యులు చెప్పారని వాపోయారు. వైద్య ఖర్చులు భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. కాగా విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బాధిత కుటుంబానికి రూ.2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అందజేశారు. ఆ నగదు వైద్య ఖర్చులకు సరిపోదని, దాతలు స్పందించి ఆదుకోవాలని చిన్నారి తల్లిదండ్రులు కోరుతున్నారు. దాతలు 94933 32788కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సహాయం చేయాలని వేడుకుంటున్నారు.


జీవితంపై విరక్తితో వృద్ధ దంపతుల ఆత్మహత్య

భార్య బావిలో దూకి.. భర్త ఉరి వేసుకుని బలవన్మరణం


రామచంద్రయ్య - సరోజినమ్మ (ఫైల్)

మణుగూరు టౌన్: వృద్ధాప్యానికి తోడు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.. ఎవరో ఒకరు మృతి చెందినా ఇంకొకరి జీవితంలో ఎలా అనే ఆవేదనతో ఇద్దరూ ఒకేసారి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుండగా దంపతులిద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన మణుగూరు మండలం పగిడేరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాసరబాద రామచంద్రయ్య(80), సరోజినమ్మ(70) దంపతులు పగిడేరులో ఎస్టీ కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉండగా.. అందరూ అదే ఊరిలో విడివిడిగా నివసిస్తున్నారు. అయితే, రామచంద్రయ్య దంపతులకు వృద్ధాప్యానికి తోడు కొంతకాలంగా షుగర్ తదితర అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. ఈ మేరకు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. ఈ క్రమంలోనే వృద్ధాప్యం, అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈనెల పథ్యాన ఆదివారం రాత్రి వీరి ఇంటికి కుమారుడు వెంకటేశ్వర్లు రాగా తల్లిదండ్రుల లేకపోవడంతో అనుమానించాడు. ఆపై స్థానికుల సాయంతో గాలించగా సమీపంలోని వ్యవసాయ బావి సమీపాన చెప్పులు కనిపించడంతో బావిలో వెదకగా సరోజినమ్మ మృతదేహం లభ్యమైంది. అదేబావిలో రామచంద్రయ్య కూడా దూకి ఉంటాడనే అనుమానంతో అర్ధరాత్రి వరకు గాలించినా ఫలితం కానరాలేదు. అనంతరం సోమవారం ఉదయం పరిసరాల్లో గాలిస్తుండగా గొల్ల కొత్తూరులోని మామిడిచెట్టుకు ఉరి వేసుకుని రామచంద్రయ్య కనిపించాడు. తొలుత భార్య బావిలో దూకాక భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొనగా మృతుల కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మణుగూరు ఎస్‌ఐ మేడ ప్రసాద్ తెలిపారు.

యాచకుడి మృతి


యాచకుడి మృతదేహం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం సమీపంలో సోమవారం ఓ యాచకుడు మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని, తెలుపు రంగు జుట్టు , తెలుపు రంగు గడ్డం కలిగి ఉండి, కాషాయ రంగు చొక్కా, పసుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు. కొంత కాలంగా రామాలయం వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని, అతని పేరు అప్పన్న అన్ని స్థానికుల ద్వారా తెలిసిందని పేర్కొన్నారు. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే 87126 82106 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

అశ్వారావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వినాయకపురం శివాలయం వద్ద సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... ఏపీలోని ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం చెంచుగూడేనికి చెందిన తెల్లం మజ్జు(32) సొంత ఊరు నుంచి వేలేరుపాడులోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం శివాలయం వద్ద రోడ్డుపై అడ్డు వచ్చిన పశువును ఢీకొట్టాడు. దీంతో కిందపడి తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్టుగా నిర్ధారించారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

డిగ్రీ విద్యార్థి హత్య కేసులో 11 మంది అరెస్ట్

పాల్వంచ: డిగ్రీ విద్యార్థి హత్య కేసులో 11 మంది నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో 10 మంది మైనర్ బాలురే ఉన్నారు. సీఐ వి.వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. ఈ నెల 27న మండలంలోని బసవతారక కాలనీ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో విచక్షణా రహితంగా కొట్టడంతో డిగ్రీ విద్యార్థి అల్లూరి విష్ణు అక్కడికక్కడే మృతి చెందాడు. గత ఫిబ్రవరి 17న జూనియర్ కళాశాలలో ఫేర్ వేల్ కార్యక్రమం జరిగింది. ఈ క్రమంలో అక్కడికి డెకరేషన్ పనిమీద వచ్చిన డిగ్రీ విద్యార్థి విష్ణుకు, జూనియర్ కళాశాల విద్యార్థి సాలెంరాజ్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో విష్ణుపై దాడికి పాల్పడ్డారు. కాగా శనివారం కళాశాల ప్రాంగణంలో ఇరువర్గాలవారు తారస పడి గొడవ పడ్డారు. అదే రోజు సాయంత్రం సమయంలో విష్ణు తన స్నేహితులతో బైక్‌పై వెళుతుండగా అడ్డగించారు. ఈ క్రమంలో మరోసారి పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో విష్ణుకు బలమైన దెబ్బలు తగలడంతో మృతి చెందాడు. దాడిలో పాల్గొన్న 11 మంది మైనర్ బాలురు, ఒక మేజర్‌ను అరెస్ట్ చేశారు. వారిపై కేసులు నమోదు చేసి, మైనర్లను వరంగల్ అబ్జర్వేషన్‌హోల్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు ఘర్షణ పడుతున్న వీడియో సోమవారం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట: మండలంలోని గాంధీనగరం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి గాంధీనగరం గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా ఎస్సై సాయికిషోర్ రెడ్డి తన సిబ్బందితో కలసి దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, ఏడుగురు పరారయ్యారు. నాలుగు బైక్‌లు, రూ.6,230 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లిరూరల్: బాసారం శివారులో కొనసాగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు రూ.19వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడికి రిమాండ్

అశ్వారావుపేట రూరల్: కత్తితో దాడికి పాల్పడిన యువకుడికి సోమవారం న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని దొంతికుంట గ్రామానికి చెందిన యువకులు ముళ్లగిరి కార్తీక్, దోమతోటి తిరుపతయ్య ఈ నెల 10న అదే గ్రామంలో జరిగిన ఓ వివాహ విందులో పాల్గొన్నారు. ఈ క్రమంలో వారి మధ్య ఘర్షణ జరగ్గా, తిరుపతయ్యపై కార్తీక్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అదే రోజు కేసు నమోదు చేశారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేసి కొత్తగూడెం న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

భూవివాదంలో కేసు నమోదు

ములకలపల్లి: సోదరుల మధ్య భూవివాదం నేపథ్యంలో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు... మండల పరిధిలోని మోటుగూడెం గ్రామానికి చెందిన కుంజా వెంకటేశ్, తన ఇంటిపక్కనే ఉన్న మిడియం వీరభద్రానికి చెందిన స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలంలో తనకూ వాటా ఇవ్వాలంటూ వెంకటేష్ సోదరుడు ప్రభుకుమార్ వాదనకు దిగాడు. సదరు ప్రదేశాన్ని ఆదివారం వెంకటేష్‌తోపాటు కుటుంబీకులు శుభ్రం చేస్తుండగా, ప్రభుకుమార్ దాడికి పాల్పడ్డాడు. ఇనుపరాడ్‌తో కొట్టగా, వెంకటేశ్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో...

బూర్గంపాడు: దాడి ఘటనలో సోమవారం బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సారపాక గాంధీనగర్‌కు చెందిన శ్యామ్‌సుందర్ అనే వ్యక్తిపై అదే కాలనీకి చెందిన రమేష్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం ఏఎస్సై నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను వేధిస్తున్న వ్యక్తిపై...

ములకలపల్లి: భార్యను వేధిస్తున్న వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని నల్లముడి గ్రామానికి చెందిన లావుడ్యా సాలమ్మ అదే గ్రామానికి చెందిన సురేశ్‌ను ఇరవై ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా పదేళ్లుగా సురేశ్ మద్యానికి బానిసై భార్యను వేధించడంతోపాటు కొడుతున్నాడు. పలుమార్లు పెద్దలు నచ్చజెప్పినా మార్పు రాలేదు. ఈ నెల 24న కూడా విచక్షణారహితంగా కొట్టడంతో సాలమ్మ ఇరుగుపొరుగువారి ఇంట్లో తలదాచుకుంది. బాధితురాలు సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కనుమరుగైన జ్ఞాపకం!

- వందేళ్ల క్రితం ఖమ్మం హెడ్‌పోస్టాఫీస్ నిర్మాణం
- బ్రిటీష్ కాలం నుంచి సమాచార కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు
- బ్యాంకు సేవలకు పుట్టినిల్లుగా పేరు
- శిథిలమవడంతో ఇటీవల కూల్చివేత


కూల్చివేతకు ముందు ఖమ్మం హెడ్‌పోస్టాఫీస్ పాత భవనం


భవనం నేలమట్టం అయ్యాక...

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం చరిత్రను పరిశీలిస్తే గుర్తొచ్చే కొన్నింట్లో హెడ్ పోస్టాఫీస్ భవనం కూడా కళ్ల ముందు కదలాడుతుంది. ఆంగ్లేయుల కాలంలో ఖమ్మం నడిబొడ్డున ప్రజల సౌకర్యార్థం తపాలా సేవల కోసం ఈ భవనాన్ని నిర్మించారు. వేయి గజాల స్థలంలో ఎనిమిది గదులను డంగు సున్నంతో మందపాటి గోడలే కాక స్లాబ్ అడుగు భాగాన కర్రలను అమర్చి పకడ్బందీగా నిర్మించారు. అనేక ప్రత్యేకతలు కలిగిన హెడ్ పోస్టాఫీస్ భవనం ఏళ్ల తరబడి సేవలందించగా చాన్నాళ్ల క్రితమే ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిలిపేసి.. శిథిలావస్థకు చేరడంతో ఇటీవల కూల్చివేశారు.

భౌగోళిక స్థితి ఆధారంగా ఏర్పాటు

బ్రిటీష్ కాలంలో వందేళ్ల క్రితం వరంగల్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలో ఖమ్మం ఎల్ఎస్‌జీ తపాలా సేవలను ప్రారంభించారు. ఈక్రమంలో ఖమ్మంలో భవనాన్ని నిర్మించగా... ఖమ్మం జిల్లాగా ఏర్పడ్డాక 1960 జనవరి 1న ఎల్ఎస్‌జీ తపాలా కార్యాలయాన్ని హెడ్ పోస్టాఫీస్‌గా మార్చారు. అనంతరం ఖమ్మం పోస్టల్ డివిజన్‌గా ఏర్పడే వరకు హెడ్ పోస్టాఫీస్ నుంచే జిల్లా వ్యాప్తంగా సేవలందాయి. 1972లో ఖమ్మం తపాలా డివిజన్‌ను ఏర్పాటు కావడంతో డివిజన్ కార్యాకలాపాలు కూడా కొంత కాలం హెడ్ పోస్టాఫీస్ ద్వారా కొనసాగాయి. ఆపై డివిజన్ కార్యాలయాన్ని గాంధీచౌక్‌లో నిర్మించారు. కాగా, డివిజన్ పరిధిలో 76 సబ్ పోస్టాఫీస్‌లు, 535 బ్రాంచి పోస్టాఫీస్‌లు ఉండగా.. 1,600 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇక ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ పరిధిలో 37 సబ్ పోస్టాఫీస్‌లకు గాను 37 మంది బ్రాంచి పోస్టుమాస్టర్లతో ఇతర ఉద్యోగులు 700 మంది పనిచేస్తున్నారు.

ఆంగ్లేయుల కాలం నుంచి..

ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ ఆంగ్లేయుల కాలం నుంచి సమాచార కేంద్రంగా పనిచేస్తోంది. ఖమ్మం జిల్లా ప్రజలు వివిధ అవసరాల కోసం ఇక్కడకు వచ్చేవారు. నిత్యం గుట్టలుగా వచ్చే ఉత్తరాలను 20 మంది పోస్టుమ్యాన్లు ప్రాంతాల వారీగా వేరుచేసి రైళ్లు, బస్సుల్లో పంపించే వారు. అప్పట్లో బ్యాంకు సేవలు ఇంకా విస్తరించకపోవడంతో పోస్టాఫీసుల ద్వారానే మనీయార్డర్ల రూపంలో లావాదేవీలు జరిగేవి. అలాగే, ఎఫ్‌డీలు, సేవింగ్ బ్యాంక్ ఖాతాలు తెరిచేవారు. ఇక టెలిగ్రామ్ వ్యవస్థ రాత్రివేళల్లో కూడా పనిచేసేది. అనంతరం కాలంలో పాత భవనం శిథిలావస్థకు చేరుతుండడంతో ఆ పక్కనే కొత్త భవనాన్ని నిర్మించారు. అయినా కొన్నాళ్లు పాత భవనం నుంచే కొన్ని విభాగాల కార్యకలాపాలు కొనసాగినా ఆపై పూర్తిగా శిథిలమవడంతో మూసివేశారు.

నేలమట్టమైన భవనం

శిథిలమై ప్రమాదకరంగా మారిన హెడ్ పోస్టాఫీస్ పాత భవనాన్ని ఖమ్మం మున్సిపల్ శాఖ అధికారులు గత గురువారం ఉదయం తొలగించారు. ఆపై స్థలం అన్యాక్రాంతం కాకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తపాలా శాఖ అధికారులు నిర్ణయించారు. ఏదిఏమైనా వేలాది మందికి సేవలందించి.. వందలాది మంది ఉద్యోగులు, స్థానికులకు ల్యాండ్‌మార్క్‌గా ఉన్న వందేళ్ల క్రితం నాటి భవనం నేలమట్టం కావడంతో ఖమ్మంలో ఓ జ్ఞాపకం కనుమరుగైనట్లయింది.

రవాణా వసతి లేక మార్చురీలో మృతదేహం

రోజంతా కుటుంబీకుల ఎదురుచూపులు

భద్రాచలంఅర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడు మృతి చెందగా... గోదావరి వరదల కారణంగా రహదారి మార్గం లేకపోవడంతో మార్చురీలో భద్రపరిచి రోజంతా పడిగాపులు కాసిన ఘటన ఇది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం టేకులొద్ది గ్రామానికి చెందిన కెచ్చల నర్సిరెడ్డి కుమారుడు శివారెడ్డి(11)కి ఈనెల 23 నుంచి మలేరియా జ్వరం వస్తుండడంతో 26వ తేదీన చింతూరులో చికిత్స చేయించారు. ఆపై 27వ తేదీన మధ్యాహ్నం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా.. మలేరియాకు తోడు ఇతర అనారోగ్య సమస్యలు ఎదురుకావడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో 27న సాయంత్రం భద్రాచలం ఏరియా ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఆ రాత్రి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి 28వ తేదీ ఆదివారం గుంటూరు వెళ్తుండగా మార్గమధ్యలోనే శివారెడ్డి మృతి చెందాడు. ఈమేరకు తిరిగి భద్రాచలం మీదుగా టేకులొద్దికి బయలుదేరారు. అయితే, గోదావరి వరద ఉధృతితో భద్రాచలంలోని కూనవరం రోడ్డులో నిర్మిస్తున్న కరకట్ట వద్ద అధికారులు రాకపోకలు నిలిపేశారు. దీంతో చేసేదేం లేక శివారెడ్డి మృతదేహాన్ని ఆయన కుటుంబీకులు భద్రాచలం ఏరియా ఆస్పత్రి మార్చురీ గదిలో ఉంచారు. గోదావరి ఉధృతి తగ్గగా సోమవారం ఉదయం అధికారులు రాకపోకలకు అనుమతించడంతో శివారెడ్డి మృతదేహాన్ని స్వస్థలమైన టేకులొద్దికి తీసుకెళ్లారు.

ఆకాశంలో హరివిల్లు


దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం గ్రామంలో సోమవారం సాయంత్రం ఆకాశంలో ఇంద్రధనస్సు కనిపించగా, స్థానికులు ఆసక్తిగా తిలకించారు. పలువురు ఆ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించారు. –దుమ్ముగూడెం